౧

# ఆ ఉగాది మళ్లీ వస్తుందా!

ఈ ఉగాదికి మన పెళ్ళయి ఎన్నేళ్ళయినట్టూ? — ఈ వెళ్ళి పోయిన సంవత్సరాలన్నీ అలా నవ్వుతూ పలకరించి ఎక్కడకు వెళ్ళినట్టూ? కలకాలం నిలిచిపోయేవి కొన్ని కొన్ని భ్రమలూ జ్ఞాపకాలే గదండీ! ఎందుకలా నవ్వుతూ చూస్తారు? మనకు పెళ్ళయి—ఉండండి! మనకు పెళ్ళయిన ఆరేడు నెలలకేగా శ్రావణమాసంలో స్వరాజ్యం వచ్చింది. అప్పుడు నాకు పన్నెండోయేడు —పన్నెండోయేట పెళ్ళయితే పదహారేళ్ళకేగా. నానిగాడు పుట్టిందీ? ఇప్పుడు యీ ప్లవంగ ఉగాదికి

చంటి దానికి ఎనిమిది నెలలూ వెడతాయి. అబ్బో ఇరవై సంవత్సరాలే ....మీరు నేనూగా ఉన్న మనల్ని మనంగా మార్చేసిన ఇరవై ఉగాదులూ ఎక్కడకు వెళ్ళినట్టు చెప్మా! నిన్న గాక మొన్న పల్లకీలో తల వొంచుకు కూర్చున్నట్టూ. గడప దగ్గర పేర్లు చెప్పినట్టూ. పేరంటాళ్ళు మనకేసి చూసినట్టూ మీరు నాకేసి చూసి నవ్వి నా చిటికెన వ్రేలు నొక్కినట్టూ.... ఇలా ఎన్నో ఎన్నో జ్ఞాపకాలు.... ఈ జ్ఞాపకాల మధ్యన మీ నవ్వు మొహం గుర్తు కొస్తే కొత్త పెళ్ళి కూతురిలా సిగ్గుపడకపోయినా మనసేవిటో ఊరికే-పరవశించి పోతుంది.

నా మొహం-నేనేవి చదువుకున్నాననీ? షష్టుఫారం ఫేలయ్యానని నన్ను వెక్కిరిస్తూంటారుగా! మీరు చదువుకుని వచ్చి నన్ను పుస్తకాలు చదవమనీ. పాటలూ అవి పాడమనీ చంపుకుతినేవారు గుర్తుందా! అప్పుడు నాకు చదువుమీదకు మన సెలా వెడుతుంది? మీ మొహంకేసి చూస్తూ మురిసిపోతూండేదాన్ని.

అప్పుడు ఉగాదికి మొదటిసారి మీ రొచ్చారు గుర్తుందా? తలుపు తీసింది నేనే-ఎవరో అనుకుని మొహంమీదకు టార్చివేశాను. అప్పుడు మీరని తెలియగానే గుండె ఝల్లుమంది. ఎవరే ఎవరే అంటే నా నోటి లోంచి మాట వస్తేనా?

ఆవాళ తలంటి పోసుకుందుకు రమ్మని నేనే పిలిచాను అమ్మ నన్ను పులుసు పోయమని చెప్పింది. నాకు సిగ్గేసింది. మీరు కళ్లు మూసుకున్నప్పుడు పనిపిల్ల చేతిలో పులుసు గిన్నె పెట్టేసి పారిపోయాను. మీరు పనిపిల్ల కాలు నొక్కరటగా— అది గిన్నెపారేసి పారిపోయింది మీకు కోపంవచ్చి నాతో మాట్లాడటంమానేశారు. ఫలహారం చేయనని. బట్టలు కట్టుకోనని అలిగారు. అమ్మ నా మీద కోప్పడింది. నేను ఏడుస్తూ పడుకున్నాను.

అప్పుడు నాన్న దాలయ్య బండి కట్టించి ఎద్దులబండిమీద పెను

గొండ మనిద్దర్నీ సినిమాకు పంపించాము. అప్పుడు మనం చూసిన బాల రాజు సినిమాలో బాలరాజులానే మీరు నా కళ్ళకనిపించే వారు.

నేను పూలు కోసుకోవాలని వెళ్ళి సుబ్బో తోటలో చెరువు మెట్ల మీద మా స్నేహితురాలితో కబుర్లు చెబుతూ కూర్చున్నానని నా చెవి మెలి పెట్టారు. గుర్తుందా?

మీరు దొంగతనంగా సిగరెట్ల కోసం కాలవ గట్టంట పై ఊరికి షికారుగా వెళ్ళి ఎంత చీకటి పడ్డా రాకపోయే సరికి నా గుండె గబగబ ఎలా కొట్టుకుందనీ? ఆ కాలవ గట్టంట నా మనసు మీ వెనకాలే ఎలా పరిగెట్టిందో నే నిప్పుడు చెప్పలేను.

కొత్తబట్టలు పట్టుకొని నన్ను రాసుకుంటూ మీరు వెళ్ళినప్పుడు, నా తలలోని మల్లెచెండును మీరు కొంటెగా లాగి నా జడను పట్టుకు గుంజి నప్పుడూ, నా నెత్తిమీద పన్నీరుజల్లి, నా మెడకు మంచిగంధం పూసి, నా బుగ్గను చిటికేసి, వెళ్ళి వస్తానని మీ రన్నపుడూ నిజంగా పండగ ఇంత తొందరగా అయిందేమా అనిపించి మీరు వెళ్ళిపోతున్నందుకు నాకళ్ళలో నీళ్ళుచిమ్మి నాకు చెప్పరాని ఉడుకుమోతుతనం వచ్చేసింది.

ఏమండీ మళ్ళీ అలాటి ఉగాది మనకు వస్తుందంటారా?

పోన్లెండి మన అమ్మాయికి పెళ్ళవుతుంది. మనింటికి అల్లుడొస్తాడు చిన్నచిన్న పేచీలు, కొసరికొసరి అలగటాలూ అవన్నీ చూస్తూ జ్ఞాపకాల్ని నెమరేసుకుంటూ కలగానైనా బ్రతకవచ్చు!

ఉమ, భారతి, సీత, సుబ్బు, సీను, రాము యింతమంది పుట్టుకొస్తారని కలగన్నామా? ఆ మొహాలన్నీ నవ్వుతూ కలకలా తిరుగుతూంటే జీవితం చేమచేముగ ఉప్పుప్పగా పుల్లగా తీయగా ఎన్నో ఎన్నెన్నో మధుర స్మృతుల్ని రేపుతుంది.

ఏమండీ ఆ యిరవై ఏళ్ళక్రితం వచ్చిన ఉగాది మళ్ళీ ఎలా వస్తుంది?